మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# మూడవ విడత పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియ పూర్తి: కలెక్టర్



ఎన్నికల సిబ్బందికి విధుల నిర్వహణపై ఆదేశాలిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు.సోమవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్‌తో కలిసి మూడవ విడత పోలింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని ఇటిక్యాల,ఎర్రవల్లి,అలంపూర్, మనోపాడు,ఉండవెల్లి (5) మండలాల్లో నిర్వహించనున్న రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం 700 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటిలో విధులు నిర్వర్తించడానికి పీఓలు 700,ఓపీఓలు 859 సిబ్బంది మొత్తం 1,559 మందిని రెండవ ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.ఒక్కో మండలానికి సంబంధించిన గ్రామపంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ అధికారులను ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్ వెర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే ప్రతి సిబ్బందికీ శిక్షణను అత్యంత పక్కాగా, నిబంధనలకు అనుగుణంగా అందించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు.జిల్లాలో గ్రామస్థాయి ఎన్నికలను పరదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్, ఈడియం శివ,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## గ్రామ అభివృద్ధే దేశాభివృద్ధి

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల టౌన్ డిసెంబర్ 8, ప్రభాతవార్త:** గ్రామాలు అభివృద్ధి చెందుతూనే దేశం అభివృద్ధి చెందుతుందనీ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గద్వాల నియోజకవర్గం స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లోభాగంగా ధరూర్ మండలపరిధిలోని నెట్టెంపాడు,నాగర్ దొడ్డి, మాల్ దొడ్డి,గార్లపాడు, ఖమ్మంపాడు గ్రామాలలో తాను బలపరిచిన సర్పంచి అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే నేను బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఓటర్లను కోరారు.గత పాలకుల నిరక్ష్యంవలన ధరూర్ మండల ప్రాంతంలోని ముంపు గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదనీ, నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతనే నాగర్‌దొడ్డి,రేలంపాడు,ఆలూరు,ఆర్అండ్ఆర్ సెంటర్‌గా ఏర్పాటు చేయడం జరిగిందనీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ నుండి అన్ని మోలిక సదుపాయాలు ఇండ్ల –మిగతా3లో..



డయల్ యువర్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.వినీత్

## డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల అనూహ్య స్పందన

### నారాయణపేట జిల్లా ఎస్పీ డా.వినీత్

**నారాయణపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. మొత్తం 23 మంది పౌరులు నేరుగా ఎస్పీ ని ఫోన్ ద్వారా సంప్రదించి తమ సమస్యలను వివరించారు. వచ్చిన ఫిర్యాదులలో భూ తగాదాలు అధికంగా ఉండటం గమనార్హమని ఎస్పీ పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సమయాన్ని సత్యనారాయణ కమాన్ దారి వైపున పెంచాలని పలువురు విజ్ఞప్తి చేశారు. అలాగే టౌన్‌లో గూడ్స్ వాహనాలు ఎక్కువసేపు రోడ్లపై నిలిచే పరిస్థితిని పరిష్కరించాలని ప్రజలు కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల –మిగతా3లో..



కాకినాడ బయలు దేరిన పీయూ జట్టు

## 14నుంచి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు

- కాకినాడలోని జవహార్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహణ
- పోటీలకు బయలుదేరిన పీయూ క్రీడాకారులు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, డిసెంబర్ 8,ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ వాలీబాల్ పురుషుల జట్టు సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనేందుకు సోమవారం జట్టు ఆంధ్రప్రదేశ్‌లోని జవహార్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడలో ఈనెల 10నుంచి 14 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ పాల్గొనేందుకు బయలుదేరింది. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జిఎన్ శ్రీనివాస్ క్రీడల్లో – మిగతా3లో..

# వందశాతం ఫలితాలు సాధించాలి

- ఐఐఐటీలో మన విద్యార్థులే సీట్లు పొందాలి
- బీఆర్ఎస్ హయాంలో విద్యావ్యవస్థ విధ్వంసం
- రానున్న రోజుల్లో మరిన్ని విద్యాపథకాలు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి





విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్8, ప్రభాత వార్త :** పదవ తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ నగరంలోని పోలీస్ లైన్ ఉన్నత పాఠశాల, ఎదిర ఉన్నత పాఠశాల, ఏనుగోండ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు తన స్వంత నిధులతో ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ తో విద్యార్థులు ఎప్పుడైనా స్కాన్ చేసి చదువుకోగలిగేలా పాఠ్యాంశాలు, వీడియో పాఠాలు, ప్రాక్టీస్ బిట్స్ వంటి డిజిటల్ కంటెంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, సొంత రాష్ట్రంలో కూడా మహబూబ్ నగర్‌ను వెనక్కి నెట్టివేశారని, ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను బీఆర్ఎస్ పాలనలో పూర్తిగా ధ్వంసం చేశారని" ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రిని ఒప్పించి ఉమ్మడి జిల్లా విద్యార్థుల కోసం మహబూబ్ నగర్‌కు ఐఐఐటి కళాశాలను తెచ్చామని, మన జిల్లాలో ఉన్న ఐఐఐటి కళాశాలలో మన ఉమ్మడి జిల్లా విద్యార్థులే అధిక శాతం ప్రవేశాలు పొందాలని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యా అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా ఆధునిక డిజిటల్ వనరులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక విద్యా కార్యక్రమాలను చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, రాషెద్ ఖాన్, మహ్మద్ మోసిన్, యాదమ్మ , నాయకులు సిహెచ్ మంజుల, వెంకటేష్ గౌడ్, కొత్త కిరణ్, రామస్వామి, మురళి గౌడ్, చంద్రకాంత్, గోపాల్, చర్ల శ్రీనివాసులు,గ్యాస్ అంజి, ఎరుకలి నర్సింహులు, ఎల్లయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- పోలింగ్ సామగ్రి జాగ్రత్తగా చూసుకోవాలి
- కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి



పీవోలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 8,ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు రాజాపూర్, నవాపేట్ మండలాలలో ప్రిసైడింగ్ అధికారులకు(పి.ఓ) లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను సోమవారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. శిక్షణలో పాల్గొన్న పిఓలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల దగ్గర ఎన్నికల సామగ్రి తీసుకునేటప్పుడు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఇతర ఎన్నికల సామాగ్రి సరిగ్గా ఉందా లేదా అని ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా పని చేస్తున్నాయా లేదా, బ్యాలెట్ పేపర్లు అన్ని సరిగ్గా ఉన్నాయా, ఏవైనా చినిగి ఉన్నాయా, సీరియల్ నంబర్లు సరిగ్గా ఉన్నాయా లేవా చూసుకోవాలని అన్నారు. పిఓలు బ్యాలెట్ పేపర్ అకౌంట్ ను సరిగ్గా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగుస్తుంది కనుక, పీఓలు వెంటనే బ్యాలెట్ బాక్స్‌ను సరిగ్గా సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు(కౌంటింగ్) ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే గెలిచిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు) జారీ చేసి అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించాలని ఆమె తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు/ఓటములకు ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యంగా పరిగణిస్తారు కాబట్టి పిఓలు అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా ఎన్నికల నియమావళిని పాటిస్తూ, ఎటువంటి తప్పులు దొర్లకొండ ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రాజాపూర్ ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని అన్నారు.కలెక్టర్ తో పాటు ఎం.పి.డి.ఓ, తహశీల్దార్,మనల అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న పీవోలు, ఏపీవోలు



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

## గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- బీజేపీ మద్దతుదారులు సర్పంచులుగా గెలిపించండి
- ఆ గ్రామాల అభివృద్ధికి రూ.10లక్షలు ఎంపీ నిధులు నుంచి అంజేస్తా..
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రకటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్8, ప్రభాతవార్త;** తెలంగాణ ప్రజలందరూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో.. బీజేపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు,మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. సోమవారం ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్రానికి మద్దతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ –మిగతా3లో..

## సర్కార్ కొలువు వదిలి సర్పంచ్‌గా పోటీ

**దామరగిద్ద, డిసెంబరు 8 ప్రభాతవార్త :** సర్పంచ్‌గా పోటీ చేసేందుకు తాండూర్ రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దామరగిద్దమండలం కానుకుర్తి గ్రామానికి చెందిన నారానోళ్ల నారాయణ తన ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పుట్టిన ఊరికి సేవ చేయడమే లక్ష్యమని తెలిపారు.



సర్పంచ్ అభ్యర్థి నారాయణ

## కల్వకుర్తిలో భారీ చోరీ...

### 40 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మాధవరెడ్డి

**కల్వకుర్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో శ్రీనివాస్‌శర్మ నివాసంలో సోమవారం భారీ చోరి జరిగిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... శ్రీనివాస్ శర్మ కుటుంబసభ్యులు గత నెల 30న వేరే గ్రామానికి వెళ్ళి సోమవారం ఉదయం ఇంటి వచ్చి చుసే సరికి తాళం విరిగి పడి ఇంట్లో సామాన్లు చిందర వందరగా పడి ఉండడం చూసి నిశ్చేష్టులై బీరువాలు తెరిచి ఉండటంతో ఇంట్లో దొంగలు పడ్డారని గమనించి వేంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్నికి ఎస్సై మాధవరెడ్డి తన సిబ్బందితో వచ్చి ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో 40 తూలల బంగారు, రూ.6 లక్షల నగదు చోరికి గురైందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకుందాం

- ప్రతి ఒక్కరూ సహకరించాలి
- పోలీస్ శాఖ సూచనలు, సలహాలు పాటించాలి
- మహబూబ్‌నగర్ ఎస్పీ జానకీ ధరావత్



**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్8, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అందుకు పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని ఎస్పీ జానకీ ధరావత్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతి–భద్రత కోసం మహబూబ్ నగర్ జిల్లా పోలీసుల నిరంతరం కృషి చేస్తున్నదని ఎస్పీ జానకీ ధరావత్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి – ప్రజలు, అభ్యర్థులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు ఆమె జారీ చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగని, గ్రామంలో శాంతి–భద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని మహబూబ్‌నగర్ పోలీసు శాఖ నుంచి విజ్ఞప్తి చేశారు.

**ప్రతి ఓటరు – ప్రజలకు సూచనలు**

1. ఎన్నికలు శాంతియుతంగా జరగాలి. ఎవ్వరూ గొడవలకు పాల్పడరాదు.
2. ఓటు కొనడం–అమ్మడం చట్టపరంగా పెద్ద నేరం. ఎక్కడైనా ఇటువంటి ప్రయత్నాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.
3. రాత్రివేళ గుంపులుగా తిరగడం, మద్యం సేవించి గొడవలు చేయడం పూర్తిగా నిషేధం.
4. బెదిరింపులు, బలవంతపు చర్యలు ఎవరూ చేయరాదు. జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి.
5. సోషల్ మీడియాలో పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు వార్తలు–వీడియోలు పంచితే చట్టరీత్యా చర్యలు తప్పవు.
6. పోలీసులు చేసే పహారా మీభద్రతకోసం. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే 100 లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్. 8712659360కు సమాచారం ఇవ్వాలి.
7. యువత శాంతి–భద్రత పరిరక్షణలో ముందుండాలి. ప్రలోభాలు, రెచ్చగొట్టే సందేశాలు చూసి ఆవేశానికి లోనుకాకండి.
8. కూడళ్ల వద్ద గుంపులుగా నిలబడడం, గొడవలకు దిగడం నేరం. కేసులు అయితే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలపై ప్రభావం ఉంటుంది.
9. ఎన్నికల కేసులు అయితే బైండ్ ఓవర్ చేసి బాండ్ షరతులు ఉంటాయి.
10. భవిష్యత్తులో చిన్నగొడవజరిగినా పెద్దకేసుగా మారే అవకాశం ఉంటుంది – జాగ్రత్తగా ఉండాలి.

**అభ్యర్థులు, పచార కార్యకర్తలకు..**

- ఎన్నికల ప్రచారం, సమావేశాలు, ర్యాలీలు అనుమతుల్లో పేర్కొన్న పరిమితులలో మాత్రమే చేయాలి.
- కులం,మతం,వర్గాల ఆధారంగా ప్రచారం చేయడం, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం నిషేధం.
- రాత్రి అర్ధరాత్రి తర్వాత సౌండ్‌తో ప్రచారం చేయరాదు. మీటింగ్‌లకు ముందుగా అనుమతి తప్పనిసరి.
- ఓటర్లకు డబ్బు,మద్యం,బహుమతులు ఇవ్వడం పెద్ద నేరం–అభ్యర్థిత్వం రద్దుఅయ్యే అవకాశం ఉంటుంది.
- ప్రచారవాహనాలు,సౌండ్ బాక్స్‌లను అనుమతులకు అనుగుణంగా తనిఖీకి సిద్ధంగా ఉంచాలి.
- ప్రత్యర్థులను రెచ్చగొట్టే చర్యలు పూర్తిగా నిషేధం.
- ఇళ్లకువెళ్లి ఓటర్లను బెదిరించడం,ఒత్తిడిచేయడం, మానసిక ఒత్తిడి పెట్టడం చట్టపరంగా నేరం.
- పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులు ఏర్పరచి వాతావరణాన్ని దెబ్బతీయరాదు.
- ఓటర్లను తరలించడం, నియంత్రించడం, వారి ఓటు స్వేచ్ఛపై ప్రభావం చూపడం నేరం.
- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై విచారణ,కేసులు,అభ్యర్థిత్వ రద్దుచర్యలు జరుగుతాయి.
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే వీడియోలు పెడితే ఐటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటారు.

**అత్యవసర సూచన..**



ఎస్పీ జానకీ

ఎవరైనా రూ. 50,000 నగదు రవాణాకు మించి నగదు తీసుకెళుతున్నప్పుడు తప్పనిసరిగా ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు వెంట పెట్టుకోవాలని సూచించారు. లేని యెడల ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు ఆ నగదును సీజ్ చేస్తారని తెలిపారు. ఎన్నికలు ప్రజల కోసం ప్రశాంతంగా నిర్వహించాలని, శాంతిని కాపాడాలని, నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు, తప్పు చేసిన వారికి భయపడకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## ఈ.వీ.ఎంలు భద్రపరిచిన
# స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా వుండాలి

**గద్వాల టౌన్ డిసెంబర్ 8, ప్రభాతవార్త:** ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం)లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ సోమవారం సంబంధిత అధికారులు,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టర్ ఈ తనిఖీ నిర్వహించారు.గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వాహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# ఓటు ఆయుధం సంధించు సమర్థులను గెలిపించు

**నారాయణపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ఆధారంగా తీసుకుని నమూనా బ్యాలెట్ పత్రాలు, నినాదాలతో కూడిన చార్టులు తయారు చేసి విద్యార్థులకు చూపించారు. ఓటు విలువ, ప్రజాస్వామ్యంలో దాని పాత్ర గురించి ఉపాధ్యాయులు సమగ్రంగా వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు స్పష్టమైన సమాధానాలు ఇచ్చి సందేహాలు నివృత్తి చేశారు. తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా ఓటు పై అవగాహన కల్పించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఓటు వేసే విధానం, గుర్తింపు కార్డుల అవసరం, పోలింగ్ కేంద్రంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సవివరంగా తెలియజేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తమైందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు నరసింహ, మంగళ, నిర్మల, శిరీష, రఘురామేశ్వర్, సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

# మద్దతుదారులతో ఇంటింటి ప్రచారం

**చిన్నచింతకుంట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** మండలంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం తమ మద్దతు దారులతో అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మండలంలోని ఉంద్యాల, దమగ్నాపూర్, నెల్లికొండి, సీతారాంపేట్, చిన్నచింతకుంట తదితర గ్రామాలలో తమ మద్దతుదారులతో కలిసి ఇంటింటి ప్రచారంలో తమ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామం దమగ్నాపూర్ లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బలపరిచిన అభ్యర్థులు తమ మద్దతుదారులతో గ్రామ పురవీధుల గుండా ర్యాలీలు నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. బి ఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్ బరిలో నిలిచిన పావని బ్యాండ్ మేళాలతో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఓటర్లకు హామీ ఇస్తూ ఓటును అభ్యర్థించారు. ఆ గ్రామంలో సర్పంచ్ పోటీ నువ్వా నేనా అనే రీతిలో జోరుగా ప్రచారాలు కొనసాగుతున్నాయి.


మద్దతుదారులతో కలిసి ప్రచారం చేస్తున్న పావని

# ఏకగ్రీవమైన సర్పంచులకు
# శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, డిసెంబరు 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నుండి ఏకగ్రీవమైన సర్పంచ్‌లకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కౌకుంట్ల మండలం నుండి పేరూరు సర్పంచ్ శృతి అరవింద్ రెడ్డి, వెంకంపల్లి సర్పంచ్ ఆల సంప్రీతి రాంరెడ్డి, దేవరకద్ర మండలం నుండి నార్లోన్ కుంట సర్పంచ్ గౌని లక్ష్మీదేవమ్మ, బస్వాపూర్ సర్పంచ్ నవనీత శేఖర్ రెడ్డిలను ఆయా గ్రామాల ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లను అభినందించి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఏకగ్రీవమైన సర్పంచులు గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని, గ్రామాల అభివృద్ధికి తన పూర్తి సహకారం అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవమైన సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# ఘనంగా అయ్యప్ప స్వాముల పడిపూజ

**మద్దూరు, డిసెంబరు 8 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం జరిగిన అయ్యప్ప స్వాముల పడిపూజ భక్తి పారవశ్యంతో సాగింది. కల్లపు దినేష్ కన్నె స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమానికి గురుస్వామి రవీంద్రనాథ్ శర్మ విశిష్ట అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షలో అనుసరించవలసిన నియమ-నిష్టల గురించి భక్తులకు సూచనలు అందించారు. పూజా సమయంలో స్వామి శరణం అయ్యప్ప.. హరహర సుతనే శరణం అయ్యప్ప.." అంటూ శరణు ఘోషలతో మార్మోగగా, భక్తులు భక్తిపరవశ్యంలో పులకించిపోయారు. దీపాల వెలుగులతో అందంగా అలంకరించారు. వివిధ మండలాల నుండి వచ్చిన అయ్యప్ప స్వాముల దీక్షధారుల సమక్షంలో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


స్వామివారికి అభిషేకం చేస్తున్న స్వాములు

# న్యూ ఎరా టాలెంట్ స్కూల్‌ను తనిఖీ చేసిన ఎంఈఓ

**భూత్పూర్,డిసెంబర్ 8,ప్రభాతవార్త :** భూత్పూర్ మండల విద్యాధికారిణి ఉషారాణి సోమవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని న్యూ టాలెంట్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో ఇనాక్టీవ్ స్టూడెంట్స్,డ్రాబాక్స్ పెండింగ్,అపార్ పెండింగ్,యుడైస్ వివరాల రికార్డులను ఎంఈఓ ఉషారాణి పరిశీలించారు.పెండిండ్‌లో ఉన్న డ్రాబాక్స్,అపార్,ఇనాక్టీవ్ స్టూడెంట్స్ వివరాలను అప్‌డేట్‌తో పాటు ఆపార్ వెంటనే పూర్తి చేసి యుడైస్‌ను అప్‌డేట్ చేయాలని పాఠశాల కరస్పాండెంట్ వి క్రాంతికుమార్‌కు సూచించారు.మండలంలో ఇంకా ఎవరైన అప్‌డేట్స్ పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తిచేయాలని సంబంధిత పాఠశాలల యాజమాన్యాలను కోరారు.


న్యూ ఎరా టాలెంట్ స్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ ఉషారాణి

# నామినేషన్ల ఉపసంహరణ ఏకగ్రీవ ప్రక్రియ

## పోస్టల్ బ్యాలెట్ జారీ వినియోగంపై శిక్షణ

**నారాయణ పేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల మూడో విడతకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవ ప్రక్రియ, పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగంపై శిక్షణా కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ శిక్షణను జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ పర్యవేక్షి ంచగా, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో చిన్న పొరపాటు కూడా తీవ్ర సమస్యలకు దారితీసే అవకాశం ఉందని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలలోపు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఒకే అభ్యర్థి మిగిలిన చోట ఏకగ్రీవత ప్రకటించేందుకు ఒత్తిడి, ప్రలోభాలు లేవని అభ్యర్థుల నుండి డిక్లరేషన్ తీసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. పోటీ అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేసి స్థానిక తహసీల్దార్లకు తెలియజేయాలని సూచించారు. పంచాయతీ, వార్డుల స్థానాలు పూర్తిగా ఏకగ్రీవమైతే ఉప సర్పంచ్ ఎన్నికను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. రక్షణ దళాలకు చెందిన సర్వీస్ ఓటర్ల జాబితాను ఖచ్చితంగా సేకరించి వార్డు వారీగా వర్గీకరించాలని నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల డ్యూటీ ఉద్యోగులకు ఫామ్ 14 దరఖాస్తుల ఆధారంగా పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయాలని సూచించారు. ప్రతి మండలంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉద్యోగులు సులభంగా ఓటు వేసేలా సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ జారీ, వినియోగంలో తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, సందేహాలు ఉంటే హ్యాండ్ బుక్‌ను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు మొగులప్పతో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్


హాజరైన అధికారులు

# పదిలో ప్రతి విద్యార్థి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**గద్వాల టౌన్, డిసెంబర్ 08, ప్రభాతవార్త:** 10వ తరగతి విద్యార్థులు ప్రతి ఒక్కరూ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి నుషిత అధికారులను ఆదేశించారు.సోమవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న భోజనం, వంటగది పరిస్థితులు,బాత్‌రూమ్‌లు, వసతి గృహ పరిసరాల శుభ్రతను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నెల మెడికల్ క్యాంప్ నిర్వహించి, విద్యార్థినులకు అవసరమైన మందులు అందించాలని సూచించారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, హాస్టల్ వసతులు , విద్యార్థినుల చదువు పరిస్థితుల గురించి వారికి తెలియజేయాలని ఆదేశించారు. విద్యార్థినులు చదువు మధ్యలో మానుకుని ఊరికి వెళ్లకుండా చూడటం వసతి గృహ అధికారుల బాధ్యత అని చెప్పారు.10వ తరగతి విద్యార్థినుల చదువు గురించి కూడా వివరంగా తెలుసుకున్నారు.ట్యూటర్లు బోధిస్తున్న విధానం, విద్యార్థినుల ప్రగతి గురించి ఆరా తీసి, ఈ విద్యాసంవత్సరంలో అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.అనంతరం రికార్డులు , వసతి గృహ గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత


వంటశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి నుషిత

## ధాన్యం విక్రయించిన 48 గంటల్లో
# డబ్బులు రైతుల ఖాతాలో జమ

**ఉప్పునుంతల, డిసెంబరు 8 ప్రభాతవార్త :** రైతులు జిల్లాలో వరి ధాన్యం అమ్మిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి చిన్న ఓబులేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ఇందిరా క్రాంతి పథం (ఐకెపి) కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా లో ఐకెపి ఆధ్వర్యంలో 77 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎండిన ధాన్యాన్ని వెంటనే తూకాలు చేసి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐకెపి సిబ్బంది రైతులు విక్రయించిన వెంటనే ధాన్యం వివరాలు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వడ్డీ లేని రుణాలు 2024 అక్టోబర్ నుంచి 20 25 మార్చి 31 వరకు 8876 గ్రూపులకు 9 కోట్ల 57 లక్షలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో క్యాటిల్ షేడ్స్, ఫామ్ పండ్స్, పండ్ల తోటలకు ప్రాధాన్యత ఇస్తాడు ఆయన పేర్కొన్నారు. డి ఆర్‌డిఓ చిన్న ఓబులేష్ తో పాటు శ్రీనిధి ఆర్ఎం మహేంద్ర కుమార్, స్థానిక ఏపిఎం బాలచందర్, మల్లేష్ లు ఉన్నారు.


ఉప్పునుంతలలో విలేకరులతో మాట్లాడుతున్న డిఆర్‌డిఓ చిన్న ఓబులేష్

# విజయ్ దివస్ సందర్భంగా జిల్లాలో సేవా కార్యక్రమాలు

**నారాయణ పేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో విజయ్ దివస్ సందర్భంగా మాజీ శాసనసభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పేటలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశ రక్షణలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించేందుకు ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు సిద్ధం చేశారు. ఉదయం 9:45 గంటలకు స్థానిక డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించనున్నారు. అనంతరం ఉదయం 10:00 గంటలకు పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. అదే సమయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశం ఉంది. తరువాత ఉదయం 11:30 గంటలకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి. విజయ్ దివస్ ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాలు ఉపయుక్తం అవుతాయని పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి జవాన్ల త్యాగాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ అన్ని కార్యక్రమాలకు మండల పార్టీ అధ్యక్షులు పట్టణ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు కూడా పాల్గొని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

# జోరుగా ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థుల హవా

**-కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, డిసెంబర్ 8 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలంలో మొదటి విడత సర్పంచ్, వార్డులకు ఎన్నికల ఈనెల 11న జరగనున్నాయి. దానికి అనుగుణంగా సోమవారం మండలంలోని గూండరు, ముకురాల, ఎల్లికల్, జంగారెడ్డిపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఆయా గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి ప్రజాపాలన ప్రభుత్వానికి అండగా నిలిచి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రతి గ్రామ పంచాయతీలు అన్ని రకాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా అందించాలని కోరారు.అదేవిధంగా ఆదివారం రాత్రి మండలంలోని వెంకటాపురం, జీడిపల్లి,కుర్మిద్ద గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట గ్రామాలసర్పంచ్ వార్డుసభ్యుల అభ్యర్థులు,మండల నాయకులు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# కౌకుంట్లలో విషాదం... లారీ ,బైకు ఢీకొని వ్యక్తి మృతి

**దేవరకద్ర, డిసెంబరు 8 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన బాలరాజు మృతి చెందడంతో కౌకుంట్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. లారీ, బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కౌకుంట్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. దేవరకద్ర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన సాలె బాలరాజు (40) పని ముగించుకొని తన మోటార్ సైకిల్ పై దేవరకద్ర నుంచి కౌకుంట్ల మండల కేంద్రానికి వస్తుండగా లారీ, బైకు ఢీ కొట్టుకున్నాయి. దీంతో మోటార్ సైకిల్ పై వస్తున్న బాలరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనితో కౌకుంట్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య కుమార్తె,కుమారుడు ఉన్నాడని ,కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు దేవరకద్ర ఎస్ఐ నాగన్న తెలిపారు.


మృతి చెందిన బాలరాజు (ఇన్‌సెట్లో ) బాలరాజు (ఫైల్)


పల్లె ప్రకృతివనం

## మందుబాబుల అడ్డాగా
# కొత్తపల్లి పల్లె ప్రకృతి వనం.. !

**నారాయణపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కొత్తపల్లి గ్రామంలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ఇప్పుడు ప్రజల విశ్రాంతి కేంద్రంగా కాకుండా మద్యం సేవించే కేంద్రంగా మారిపోయింది. రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు వనం లోపలే తాగి సీసాలు, ప్లాస్టిక్ చెత్త ఎక్కడ పడితే అక్కడ పారేసి అసహ్యకర వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఈ పరిస్థితిని గ్రామస్తులు పలుమార్లు అటవీశాఖ, గ్రామపంచాయతి, పోలీసులకు తెలిపినా ఎవరి నుంచి స్పందన లేదు ప్రజల కోసం నిర్మించిన వనాన్ని చెడు పనులకు వదిలేయడం ఎంత వరకూ సరైంది? అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. వనం చుట్టూ గస్తీ, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఓట్ చోరీపై సంతకాల సేకరణ

**మహబూబ్‌నగర్, డిసెంబర్8,ప్రభాతవార్త :** ఓట్ల దొంగలను ఎలక్షన్ కమిషన్ కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఓట్ చోరీ కార్యక్రమాన్ని భారతదేశం మంత ప్రతి బూతు స్థాయిలో సంతకాలు సేకరణ చేయాలని కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ప్రతి బూతులో ఉన్న ఓటర్ల దగ్గరికి వెళ్లి సంతకాలను సేకరించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఓట్ చోరీకి పాల్పడుతున్న కార్యకలాపాలను వివరిస్తూ ఓట్ చోరి వ్యవహారానికి సంబంధించిన పత్రాలపై సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితామధుసూదన్‌రెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, యువనాయకులు రమేశ్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాఠశాల
# నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న శ్రీశ్రీ పంచమ సిద్ధలింగ మహా స్వాములు

**మక్తల్ టౌన్, డిసెంబరు 8 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామంలో పూజ్య శ్రీశ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వాముల వారి ఆధ్వర్యంలో సోమవారం శ్రీ సిద్ధలింగేశ్వర విద్యాపీఠం నూతన పాఠశాల నిర్మాణం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మఠాల పీఠాధిపతులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి**

**- మహబూబ్‌గర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ గౌడ్**


మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

**మహబూబ్‌గర్,డిసెంబర్8, ప్రభాతవార్త:**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ సత్తా చాటాలని పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధికస్థానాల్లో గెలిపించాలని మహబూబ్నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్ కోరారు.మహబూబ్నగర్ మండల పరిధిలోని మాచన్పల్లి, రామచంద్రపురం మరియు అప్పయపల్లి గ్రామాల ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులు వెంకటయ్య, బాబురావు, అరుణ జ్యోతిని అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల అభివృద్ధి కోసం సంపూర్ణ సహాయ-సహకారాలు అందిస్తామని హామీ ఇస్తూ, ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ముడాచైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, సిరాజ్ ఖాద్రి,ఫయాజ్,గ్రామప్రజలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల ఖర్చు?



**అభ్యర్థులకు తలనొప్పిగా ఎన్నికల వ్యయభారం**

**మద్దూరు, డిసెంబరు8 ప్రభాతవార్త:** ఉమ్మడి మద్దూర్ కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. నామినేషన్లు పూర్తైన తర్వాత పార్టీ నేతలు తమ అనుచరులతో కలిసి బరిలోకి దిగటంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. అయితే, గెలుపుకోసం అవసరమయ్యే భారీఖర్చులు అభ్యర్థులందరినీ ఆందోళనలో పడేస్తున్నాయి. కొందరు అభ్యర్థులు ఆస్తులను కూడాజమ చేస్తూ, మరికొందరు కొన్నపుడుఅమ్ముకోవడం వంటివి చేయాల్సిన పరిస్థితిలో ఉన్నారు.

**రూ.10 నుండి 25 లక్షల వరకు ఖర్చు ? :** చిన్న పంచాయతీల్లో సుమారు రూ.10 లక్షల వరకు, పెద్ద గ్రామాల్లో రూ.20-25 లక్షల వరకు ఖర్చులు వందల కోట్లుగా చేరుతున్నాయి. అందువల్ల ప్రచారం డబ్బు ఆధారితంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సర్పంచ్ పదవికి ఉన్న అధికారాలు, అభివృద్ధి నిధులు ఆకర్షణగా మారడంతో పోటీదారులు వెనకడుగు వేయడం లేదు.

**గెలిచినా, ఓడినా సమస్యలే : డా. ఎం. రాములు పిహెచ్.డి, చెన్నారం గ్రామం**



భారీ ఖర్చుతో గెలిచిన వారు అప్పుల భారాన్ని ఎదుర్కొంటున్నారు. ఓడిపోయిన వారు మాత్రం మరింత కష్టాల్లో పడతారు. యువత ఈ పరిస్థితిని గమనిస్తూ, డబ్బు, మద్యం వంటి ఆకర్షణల ప్రభావంలో వచ్చి ఓటు వేయకూడదని హెచ్చరిస్తున్నారు. నిజాయితీగా గ్రామ సేవ చేసే అభ్యర్థులకే అవకాశం ఇవ్వాలన్న కోరిక వ్యక్తం చేస్తున్నారు. యువతకు సందేశం ఎన్నికలు కేవలం ఓటు వేయడమే కాదు, మన గ్రామ భవిష్యత్తును నిర్ణయించే సమయం. డబ్బు, మద్యం వంటి ఆకర్షణలకు ప్రభావం చెందకుండా, నిజాయితీగా సేవ చేసే అభ్యర్థులకే ఓటు వేయండి. మంచి వ్యక్తిని గెలిస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందని. ప్రతి యువత ఈ బాధ్యతను స్వీకరించాలి.

# హోరా హోరీ..



- సర్పంచ్ నువ్వా.. నేనా...
- పోటాపోటీగా ఎన్నికల ప్రచారం
- పల్లెల్లో ఊపందుకున్న రాజకీయ వేడి

**దేవరకద్ర, డిసెంబరు8 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతుంది. పల్లె పగ్గాలు చేజిక్కించుకునేందుకు అభ్యర్థులు ఎవరికి వారు వ్యూహ ప్రతి వ్యూహాలు రచిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థులను ఓటమి పాలు చేసేందుకు తమదైన శైలిలో కృషి చేస్తున్నారు. సర్పంచ్ నువ్వా నేనా అనే విధంగా పోటీ తత్వంతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుండడంతో పల్లెల్లో రాజకీయ వేడి ఊపందుకుంది. పంచాయతీ ఎన్నికల్లో మద్యం కీలకంగా మారింది. ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారాలు జరుపుతూ, ఒక్కో పంచాయతీలో నిబంధనలకు మించి ఖర్చులు పెడుతూ సర్పంచ్ పదవిని దక్కించుకున్నందుకు పోటీ పడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ నుంచే ప్రలోభాలు షురూ అయ్యాయి. ఆయా గ్రామాల్లో ఓటర్లను మద్యం మత్తులో ముంచుతున్నారు. పలుచోట్ల బరిలో నిలిచిన అభ్యర్థులు తమకు అనుకూలంగాఓట్లు వేయాలనికోరుతూ ఉదయంటిఫిన్ మొదలుకొని, రాత్రిమందు, విందులను ఏర్పాటుచేస్తూ ఓటర్లకుగాలం వేస్తున్నారు.



**కౌకుంట్లలో ఊపందుకున్న ప్రచారం...**

జిల్లాలో ఎన్నికలు జరగనున్న పంచాయతీలో ద్విముఖ, త్రిముఖ పోటీ ఎక్కువగా జరుగుతుంది. ఇప్పటికే మొదటి రెండో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ఎన్నికల నిర్వహణ సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల ప్రచారాలు జోరందుకున్నాయి. అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా పావులు కదుపుతు న్నారు. బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ మద్దతు తెలిపిన అభ్యర్థులతో పాటు, స్వతంత్రాలు ఇంటింటికి ప్రచారాలను ముమ్మరంగా నిర్వహి స్తున్నారు. తమకు కేటాయించిన గుర్తులతో కలిగిన జెండాలు, ప్లకార్డులు, కరపత్రాలతో ఓటర్లను ఆశ్రయిస్తున్నారు. సర్పంచ్‌గా గెలిపిస్తే భవిష్యత్తులో గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశామని విషయాలను ప్రస్తావిస్తున్నారు. పలుచోట్ల బాండ్ పేపర్లపై తమ మేనిఫెస్టోనులిఖితపూర్వకంగా రాసి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. చాలా వరకుగ్రామాల్లో కులసంఘాలు, యువజనసంఘాలను, అభ్యర్థులు అధికంగా ప్రభావితం చేస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్న కొన్నిపంచాయితీలలో సర్పంచ్ నువ్వా నేనా అనే విధంగా ప్రచారాలను కొనసాగిస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**చిన్నచింతకుంట, డిసెంబరు 8 ప్రభాతవార్త:** మండలంలోని మద్దూరు గ్రామంలో విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన బోయ ఆంజనే యులుకు చెందిన ఎద్దు మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు 25 హెచ్‌పి విద్యుత్ ట్రాన్ ఫార్మర్‌కు తాకడంతో విద్యుత్ షాక్ గురై మృతి చెందని గ్రామస్తులు తెలిపారు. బాధితుడు ఆరు నెలల క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం రూ. 75 వేలతో కొనుగోలు చేసుకు న్నానని, ఇలా విద్యుత్ షాక్ తో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకం

- స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించడం పోలీసుల బాధ్యత
- జోగులాంబ జోన్ డి.ఐ.జి. ఎల్ఎస్ చౌహాన్



సమావేశంలో మాట్లాడుతున్న జోగులాంబ జోన్ డి.ఐ.జి.ఎల్ఎస్ చౌహాన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్8 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జోగుళాంబ జోన్ డి.ఐ.జి.ఎల్.ఎస్. చౌహాన్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని అధికారులు ఇచ్చిన వివరాలను విశ్లేషించి, పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి ఎల్ఎస్ చౌహాన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, ప్రతి ఓటరు భయపడకుండా, స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించడం పోలీసుల భాధ్యత అని చెప్పారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిస్థితిని అధ్యయనం చేసిన డి.ఐ.జి. ప్రత్యేక బృందాల గస్తీ, రాత్రి వేళల్లో నిఘా, ఇంటెలిజెన్స్ సమాచార సేకరణపై మరింత దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన, విద్వేషపూరిత పోస్టులు లేదా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే కార్యకలాపాలను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా నిజమైన ట్రబల్ మంగర్స్ నీ గుర్తించి బైండోవర్ కేసులు చేయాలి, మద్యం అక్రమ రవాణ, బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలపై, రౌడీ షీటర్స్ కదలికలపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, చట్టవిరుద్ధ చర్యలపై కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. తక్కువ టైంలో జిల్లా ఎస్పీ జిల్లా మీద మంచి అవగాహన కలిగి ఉన్నారని ప్రశంసించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, అదనపు ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జిల్లాలో ఉన్న అందరూ ఇన్‌స్పెక్టర్లు ఆర్ఐలు, అన్ని పోలీస్ స్టేషన్స్ ఎస్సైలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే గ్రామాభివృద్ధి

**మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, డిసెంబరు8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను సర్పంచులుగా గెలిపిస్తేనే గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మొదటి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఖిల్లా ఘణపురం మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ప్రస్తుతం మూడేళ్లు తాను ఎమ్మెల్యేగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మల్లు రవి ఎంపీగా ఉంటారని గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులనే అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఘణపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయకుమార్, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, వెంకట్రావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటిఆదిత్య, వనపర్తి ప్రముఖ వైద్యులుపగిడాల శ్రీనివాస్, మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మహిళలు కార్యకర్తలు యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సంప్రదాయ నృత్య సంస్కృతిని కాపాడుదాం!

- భారతదేశంలో భరతనాట్యానికి ప్రత్యేక స్థానం
- డాక్టర్ రమ్య సౌజన్య, మెడికల్ రాము
- చిన్నారులకు గజ్జ పూజ



చిన్నారులతో డాక్టర్ రమ్య సౌజన్య, మెడికల్ రాము

**కల్వకుర్తి, డిసెంబర్8 ప్రభాతవార్త:** ఆధునిక వైఖరులు, ప్రాచాత్య ప్రభావాలు పెరిగిపోతున్న ఈ కాలంలో మరుగునపడుతున్న సంప్రదాయ నృత్య కళలను కాపాడుకోవాలని ప్రముఖ వైద్యురాలు, మానవతా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమ్య సౌజన్య, ప్రముఖ సమాజ సేవకుడు మెడికల్ రాములు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కూచిపూడి భరతనాట్యం నేర్చుకుంటున్న చిన్నారులకు గజ్జ పూజ నిర్వహించారు. నృత్య శిక్షకుడు రవికాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రశ్చాత్య మోజులో పడి సాంప్రదాయ నృత్య మరుగున పడిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల కళా నైపుణ్యాన్ని మెరుగుపరచడమే కాక, సంప్రదాయ విలువల్ని భవిష్యత్ తరతరాలకు అందించడం లక్ష్యంగా చిన్నారులకు క్లాసికల్ డాన్స్ నేర్పుతున్న రవికాంత్‌ను అభినందించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మెడికల్ రామన్న పేర్కొన్నారు. నృత్య గురువులు కూడా మాట్లాడి ఈ తరహా ప్రోత్సాహంచిన్నారుల్లో అభిరుచి, అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నృత్యంలో చిన్నారులకు మానసిక ఒత్తిడి తగ్గి విద్యపై శ్రద్ధ పెట్టే అవకాశం మెరుగవవుతుందని వారన్నారు. అనంతరం మిస్టర్‌రవికాంత్, శృతిలయఅకాడమీ ఛైర్మన్ చిత్తరంజన్‌దాస్ విద్యార్థుల చేత గజ పూజ చేయించారు. అనంతరం వారికి గజ్జలు కట్టి పూజ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థినిల తల్లిదండ్రులు, బీఆర్ఎస్ నాయకులు ఆమనగల్ భాస్కర్, దుబ్బ నాగేష్, బొమ్మకూరి సందీప్, రాజేంద్రప్రసాద్, కడారి రామకృష్ణ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార పర్వంలో సామాజిక మాధ్యమాల జోరు

- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న నాయకులు



**నవాబుపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త :** అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థుల ప్రచారాల జోరు అధిక సంఖ్యలో పెరిగింది. పల్లెల్లో పంచాయతీ ఎన్నికల రాజకీయాలు వేడెక్కాయి. ఇంటింటికి వెళ్తూ అభ్యర్థులు ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రచార పర్వంలో సామాజిక మాధ్యమాలనూ జోరుగా వినియోగిస్తున్నారు. గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి విడతలో ఈనెల 11న జరిగే ఎన్నికలకు అధికార పార్టీ అభ్యర్థులు జోరుగా కాన్వార్సింగ్ నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. దీంతో తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. మండల పరిధిలోనిలోకిరేవు గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి అయిన గుండేటి పద్మావతి యాదయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ అభ్యర్థి వెంట అధిక సంఖ్యలో నాయకులు పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గ్రామాల్లో అభ్యర్థులు తమతమ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలతో పాటు స్నేహితులను వెంటేసుకుని ప్రతి ఇంటిని చుట్టేస్తున్నారు. ప్రచారానికి తక్కువ సమయం ఉండడంతో అభ్యర్థులు డోర్‌టూ డోర్ క్యాంపెయిన్ ముమ్మరం చేశారు. అలాగే సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచార మోత మోగిస్తున్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రమును సందర్శించిన జిల్లా కలెక్టర్

**గద్వాల టౌన్ డిసెంబర్ 8, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తమ సొంత మండలాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు సోమవారం ధరూర్, కేటీ దొడ్డి మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కు ఆయా మండలాలకు చెందిన ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని, వారికిచ్చిన ఫామ్ 14 లో వివరాలను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ వద్ద సిబ్బందితో మాటాడి తగు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్కు దరఖాస్తు చేసుకొని వినియోగించుకోని వారి వివరాలను, ఎంతమంది వినియోగించుకున్నారో వివరాలునమోదు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. ఆయా గ్రామ పంచాయతీల ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చిన వారి వివరాలు సరిచూసుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌కు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేశారా అని అధికారులను అడిగారు. పోస్టల్ బ్యాలెట్ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరును దగ్గరుండి పరిశీలించారు. ఎలక్ట్రోరల్ తప్పనిసరిగా మానిటరింగ్ చేసుకోవాలన్నారు ఆయా గ్రామ పంచాయతీల వారీగా బ్యాలెట్ పేపర్లలో వార్డు సభ్యుల, సర్పంచి అభ్యర్థుల వివరాలను చూశారు. పోస్టల్ బ్యాలెట్స్ ప్రక్రియ పూర్తయ్యాక ఆయా గ్రామ పంచాయతీల వారీగా వచ్చిన పోస్టల్ బ్యాలెట్స్‌ను సంబంధిత ప్రిసైడింగ్ అధికారులకు అప్పగించాలన్నారు. అనంతరం కేటీ దొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ పేపర్స్ ముద్రణలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు. బ్యాలెట్ బాక్స్ లు, వివిధ పోలింగ్ ఫామ్స్, తదితర సామాగ్రిని పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లా మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, ఆయా మండలాల ఎంపీడీవో లు కృష్ణమోహన్, రమణారావు, తహసిల్దార్‌లు నరేందర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# మా గ్రామానికి ఏం చేస్తారు..?

- జెండాలు, ఎజెండాలు మాకొద్దు
- గ్రామాభివృద్ధే మా ఎజెండా..
- సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న ధన్వాడ యువత

**ధన్వాడ, డిసెంబరు8 ప్రభాతవార్త :** స్థానిక రాజకీయాలు కీలక దశకు చేరుకున్నాయి. పంచాయతీ ఎన్నికల వేడితో గ్రామాలు హీటెక్కాయి. మా గ్రామానికి ఏం చేస్తారో చెప్పాలని, గత ఎన్నికల ఇచ్చిన హామీల అములు ఏ మేరకు చేశారో చూడాలని సోషల్ మీడియా వేదికగా యువత ప్రశ్నిస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులను అడుగుతున్నారు. తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ జెండాలు ఎత్తిపట్టిన కార్యకర్తలు ఓటేసినంత మాత్రానా అభ్యర్థి గెలుస్తాడని అనుకుంటే సమంజసం కాదు కదా.. గత ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు, ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయని ధన్వాడ యువతన ప్రశ్నిస్తున్నారు. తమకు అభివృద్ధి చేసే ప్రజలు ఇక ఆమోదించడం లేదని తాజా రాజకీయ వాతావరణమే చెబుతోంది.

గత ఎన్నికల్లో ధన్వాడ యువత ముందుకు వచ్చి అభివృద్ధి సూచించే మెనిఫెస్టోను సిద్ధం చేసిన విషయాలను గ్రామాల సభ్యులున్న సోషల్ మీడియాలో చర్చిస్తూ కొత్త రకం చర్చకు దారితీస్తున్నారు. పారదర్శక పాలన నుంచి మౌలిక వసతుల దిద్దుబాట్ల వరకు ఎన్నో వాగ్దానాలు చేసినా.. మళ్లీ కొత్తగా ఎన్నికలు వచ్చినా గానీ ఆ మెనిఫెస్టోలో సగం పనులైనా ఊపందుకోలేదని యువత ప్రశ్నిస్తోంది. మెనిఫెస్టో కోసం ఇచ్చిన మాటలు, ప్రచారం కోసం ఇచ్చిన హామీలు.. అమలుకు ఎప్పుడు వస్తాయి?

**అభివృద్ధే మా ఎజెండా...జెండా..**

సోషల్ మీడియా గ్రూపుల్లో, గ్రామ రాజకీయ వేదికల్లో పాకులాడుతున్న ఆయా పార్టీల అభ్యర్థులకు యువత ఒక్కటే మాట చెబుతున్నారు. జెండాలు ఎజెండాలు కాదు.. గ్రామ అభివృద్ధే తమ ఎజెండా అని తేల్చి చెబుతున్నారు. ఏ పార్టీ మెనిఫెస్టో పూర్తిగా, నిజాయితీగా గ్రూపుల్లో పెట్టండి. పనికిమాలిన హామీలు, అసాధ్యమైన వాగ్దానాలు మాత్రం వద్దు అంటూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

**అధికారమా.. అభివృద్ధా..?**

అధికారానికి కోసం పరుగులు తీస్తున్నవాళ్లు ఒక వైపు..అభివృద్ధి కోసం ఇష్టపడి పని చేసే నాయకులు ఇంకో వైపు..ఈ మధ్య తేడా ఎవరి ప్రచారంలో కనిపించక పోయినా, ప్రజల ఓటింగ్ బూతుల వద్ద మాత్రం స్పష్టంగా తేలిపోతోందనే సంకేతాలు ఉన్నాయి. ఇప్పుడు నిర్ణయించాల్సింది ఒకటే? అధికారానికి పాకులాడే వారిని నమ్మాలా? లేక నిజంగా గ్రామం కోసం కష్టపడే నాయకత్వాన్ని ఎంచుకోవాలా? ధన్వాడ యువత ఈసారి రాజకీయ చదరంగాన్ని కాక..గ్రామ భవిష్యత్తును కాపాడే అభివృద్ధి దారిని ఎంచుకునేందుకు సిద్ధమవుతోంది.



# ఎన్నికల విధులకు తప్పనిసరి హాజరుకావాలి

- గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు
- కలెక్టర్ విజయేంద్ర బోయి వెల్లడి



కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన పి.ఓ.లు, ఓ.పి.ఓలు ఎన్నికల విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు తమ విధులను తూ.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై ఎన్నికల నిబంధనల ననుసరించి క్రమ శిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ ప్రకటనలో హెచ్చరించారు.

## సమాజ సేవలో మహిళలు ముందుండాలి

- ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి



బాలమణిని సన్మానిస్తున్న సభ్యులు

**జడ్చర్ల, డిసెంబర్ 8, ప్రభాతవార్త:** సమాజ సేవలో మహిళలు ముందు వరుసలో ఉండాలని ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలి బాలమణి పిలుపునిచ్చారు. సంస్కార భారతీయ ఆధ్వర్యంలో ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలి బాలమణి యూత్ ఐకాన్‌అవార్డ్ అందుకున్న సందర్భంగా దాతృత ఫౌండేషన్ వారు ఆమెకి యూత్ ఐకాన్ అవార్డ్ అందజేసి సత్కరించారు. ఈ అవార్డ్ అందుకున్న బాలమణి సంస్కార భారతి జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రాధాకృష్ణ సన్మానించారు. మరెన్నో సేవా కార్యక్రమాలు మహిళలకు స్వయం ఉపాధి రాణిస్తూ సమాజ సేవలో మహిళ కుట్టు మిషన్ తమవంతు సహకారం అందిస్తూ మహిళ ఆర్థిక అభివృద్ధికై దోహదపడుతున్న బాలమణిని అభినందించారు. మున్ముందు మరెన్నో కార్యక్రమాలు చేపట్టి సమాజంలో తమ సేవానందించాలనికోరారు. కార్యక్రమంలో మహిళలుఉష, శ్యామలమ్మ, అంజలి, మహిళ శిక్షణ శిబిరం విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే దేశాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పట్టాలను అందించి ఇండ్ల నిర్మాణం చేయించడం జరిగిందన్నారు. ధరూర్ మండల అభివృద్ధికి ఎంతో కృషి చేయడం జరిగిందనీ ముఖ్యంగా గ్రామాలలోని మౌలిక సదుపాయాలు సి.సి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, మంచినీటి సౌకర్యం, విద్యుత్ స్తంభాలు, పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముంపు గురైన గ్రామాలలోనీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి రావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించే విధంగా నావంతు కృషి చేస్తున్నాని వారు తెలిపారు. అదేవిదంగా గార్లపాడు గ్రామంలో ఎన్నికల తర్వాత అర్హులైన ప్రతిఒక్కరికి ఇండ్ల పట్టాలను అందజేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీధర్‌గౌడ్, మాజీ ఆలయంకమిటీ ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ కృష్ణయ్య, నాయకులు కురుమన్న, భీమ్‌రెడ్డి, బషీర్, భీమ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

## 14 నుంచి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

మంచి ప్రతిభ కనబరిచి పాలమూరు యూనివర్సిటీకి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తుల అందజేసి వారికి బెస్ట్ విషెస్ చెప్పి క్రీడల్లో ఉన్నతంగా ఎదిగి ఈ క్రీడా సర్టిఫికెట్స్ ఇతర ఎడ్యుకేషన్ లో కూడా ఎంతగానో ఉపయోగపడతాయని క్రీడల గురించి తెలియజేసి క్రీడాకారులకు యూనివర్సిటీతరపున అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ పి రమేష్‌బాబు, అకాడమిక్ అడిసెల్ డైరెక్టర్ డాక్టర్ వి. చంద్ర కిరణ్ క్రీడాకారులకు పలు సూచనలు ఇచ్చిఎంపికైన క్రీడాకారులనుఅభినందించారు. ఎంపికైన క్రీడాకారులల్లో నాగచైతన్య, పి సంతోష్, శైబాజ్ ఖాన్, హర్షవర్ధన్, ఈ గణేష్, తిరుమల్, బి యశ్వంత్, బి ఈశ్వర్, టి ఉదయ్ కుమార్, ఎంసీతారాం, జివేణు, మరియు అస్సలు మొహియుద్దీన్ ఉన్నారు. కార్యక్రమంలోపాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ వై శ్రీనివాసులు మరియు వాలీబాల్ కోచ్ ఎం వెంకటేష్ మేనేజర్ డాక్టర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల అనూహ్య స్పందన

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో నామినేషన్లు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి పెడుతున్నారని, దీనిపై పోలీసు రక్షణ కల్పించాలని కూడా పౌరులు తెలియజేశారు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రూటులో లైటింగ్ సమస్య ఉందని, ప్రాపర్టీ దొంగతనం కేసుల్లో రికవరీ జరగలేదని కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. అందిన ప్రతి సమస్యను శ్రద్ధగా విన్న ఎస్పీ వెంటనే సంబంధిత అధికారులకుఆదేశాలు జారీ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించగా, మిగతా వాటిపై దర్యాప్తు జరిపి నివేదికను ఎస్పీ కార్యాలయానికి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రజలకు పోలీసుశాఖను మరింత చేరువ చేస్తున్నదని, ప్రజల్లో నమ్మకాన్నిపెంచుతోందని ఎస్పీ డా.వినీత్ తెలిపారు. జిల్లా ప్రజలు ఎలాంటి సమస్యలుఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని పారదర్శకత పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న.. రూపాయి నిధులు గ్రామాలకు ఇవ్వలేదని ఆరోపించారు. తెలంగాణలో గ్రామాభివృద్ధి జరగాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామాలఅభివృద్ధికి తోడ్పడుతున్నందున.. బీజేపీ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యులు గా పోటీ చేస్తున్న బీజేపీ మద్దతుదారులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యురాలుగా ఆయా గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లుగా బీజేపీ మద్దతుదారులను గెలిపించిన గ్రామాలకు, ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు అభివృద్ధికి అందజేస్తానని ప్రకటించారు. గ్రామాలఅభివృద్ధి కోసం సర్పంచ్, వార్డు సభ్యులుగా బీజేపీ మద్దతుదారులను పెద్ద ఎత్తున గెలిపించాలని కోరారు.

## ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి
-బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

**మనూర్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఎస్ఐ కోటేశ్వరరావు అన్నారు. సోమవారం వాహనాలను ఎస్ఐ తనిఖీచేశారు. ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదును తరలించకూడదన్నారు. మద్యం తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు 51 మందిని బైండోవర్ చేశామన్నారు. మండలంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ముగ్గురి పై కేసులు నమోదుచేశామని ఎస్ఐ కోటేశ్వరరావు గుర్తుచేశారు.

## చేర్యాల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు సంరక్షణ, భద్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కంది, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చేర్యాలలోని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సోమవారం బాలలసంరక్షణ, భద్రతపై జిల్లా బాలల సంరక్షణాధికారి రాధ్య రత్నం, సఖీ సెంటర్ కవిత, చైల్డ్ హెల్ప్‌లైన్ నవీన్, ఇంద్రకరణ్ పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఘనీ, సంధ్యారాణిలు అవగాహన కల్పించారు. కుటుంబ, మోసాలు, నేరాలపై సమాజంలో జరుగుతున్న సంఘటనలపై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు వివరించారు. బాలికలు జాగ్రత్తగా, ధైర్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. నేరాలు చేసేందుకు బాలలను వాడుకుంటున్నారని, చిన్నారులు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు.

## 8.50లక్షలతో ఓపెన్ డ్రైన్ పనులకు శ్రీకారం
-భూమిపూజ చేసిన కార్పొరేటర్ పుష్పనగేష్


ఓపెన్ డ్రైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంట లింగంపల్లి పోలీసు ఠాణా వద్ద నీరు నిలుస్తుండటంతో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఓపెన్ డ్రైన్ పనులకు శ్రీకారం చుట్టినట్లు కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. సోమవారం లింగంపల్లి పోలీసుఠాణా నుంచి ప్రీతి ఆసుపత్రివరకు రూ. 8.50లక్షల జిహెచ్ఎంసి నిధులతో ఓపెన్ డ్రైన్ పనులకు కార్పొరేటర్ భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. లింగమపల్లి నుంచి ప్రీతి ఆసుపత్రి మీదుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వరకు సిసిరోడ్డు పనులను ఓపెన్ డ్రైన్ పనులు పూర్తయిన వెంటనే ప్రారంభిస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ దివ్య, శ్రీనివాస్ రాజు, నిరంజన్, గారెల శ్రీశైలం, కాసాల వీరేశం, మల్లేష్, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రైడెంట్ కర్మాగారాన్ని ప్రారంభించండి
-ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం


మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం

**జహీరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
చెరుకు రైతులను ఆదుకునేందుకు మండలపరిధిలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం అన్నారు. సోమవారం నరోత్తం మాట్లాడుతూ కర్మాగారం పరిధిలోని 8 మండలాల్లో 26వేలకు పైగా ఎకరాల్లో 10వేలకు పైగా రైతులు చెరుకును పండిస్తున్నారని గుర్తుచేశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కర్మాగారాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలో ఉన్నా, కర్మాగారం విషయంలో పట్టనట్లుగా వ్యవహరించడం తగదన్నారు. చెరుకు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చెరుకుకు మద్దతుధర ప్రకటించి, కర్మాగారాన్ని ప్రభుత్వమే ప్రారంభించాలని నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.నర్సింలు, శికారి గోపాల్‌లు ఉన్నారు.

## మండలంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్


కందిలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

**కంది, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేందుకు సోమవారం పోలీసులు మండల కేంద్రమైన కందితోపాటు మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సత్తయ్య, సంగారెడ్డి రూరల్ సిఐ క్రాంతికుమార్, సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, హారిక, రఫియుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్‌లపై ఉద్యోగుల మీనమేషాలు

-టేక్మాల్‌కు 54 పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు
-ఓటుహక్కును వినియోగించుకున్నది 48 మంది



**టేక్మాల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
ఓటుహక్కు ఉన్న ప్రతివ్యక్తి తమ ఓటును వినియోగించుకునే ప్రాథమిక హక్కును రాజ్యాంగం కల్పించింది. స్వేచ్ఛగా ఓటేయడానికి వెసులుబాటు ఇచ్చింది. కానీ ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోవాలా, వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు. ఎందుకంటే ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు వేయాల్సి ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలైతే ఫర్వాలేదు కాని ఎటొచ్చీ స్థానిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలంటేనే ప్రభుత్వ ఉద్యోగులు కొంత అంతర్మథనం చెందుతున్నారు. ఎందుకంటే పోస్టల్‌బ్యాలెట్‌ద్వారా ఓటువేస్తే పంచాయతీ పరిధిలో చిన్నచిన్న గ్రామాల్లోని వార్డుస్థాయిల్లో ఆ ఉద్యోగి ఎవరికి ఓటేశారనేది నిర్దిష్టంగా గ్రహించగలిగే అవకాశం ఉంది. ఉదాహరణకు 300లోపు ఓటర్లున్న ఓచిన్న గ్రామపంచాయతీలో అదే గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఏదో ఒక వార్డులో ఓటు ఉందనుకుంటే ఆ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్‌ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటాడు. టేక్మాల్ మండలంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోమంది ఉన్నప్పటికీ కేవలం 54 పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు చేసుకున్నారు. ఈనెల 8వ తేదిన 48మంది ఉద్యోగులు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ తర్వాత ఓట్ల కౌంటింగ్ సమయంలో తొలుత పోస్టల్‌బ్యాలెట్‌ను లెక్కించినతర్వాతే పోలైన ఓట్లను లెక్కిస్తారు. అయితే పోస్టల్‌బ్యాలెట్ ద్వారా వార్డుపరిధిలో ఓటుహక్కు వినియోగించుకున్న ఓటరు ఏ అభ్యర్థికి ఓటువేశారో తెలుస్తుంది. దీంతో పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటరైన సదరు ఉద్యోగి రహస్యం బట్టబయలయితే రాజకీయ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటును వాడుకోవాలా, వద్దా అనే సందిగ్ధంలో చాలమంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోలేదు. పోలైన ఓట్లతో కలపాలని సూచిస్తున్నారు. పోస్టల్‌బ్యాలెట్ రహస్యం బట్టబయలుకాగా పోలైన ఓట్లతోపాటే పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను కలిపి ఓట్లను లెక్కించాలని ప్రభుత్వోద్యోగులు ఎన్నికల సంఘానికి సూచన చేస్తున్నారు. ఇలా అయితే ఏదైనా చిన్నగ్రామాల్లో ఒకరిద్దరుమాత్రమే ప్రభుత్వ ఉద్యోగులుండే ఓటర్లు పోస్టల్‌బ్యాలెట్ ఓట్లను పోలైన ఓట్లతోకలిపి లెక్కిస్తే వారు ఎవరికివేశారనే విషయం నిర్ధారణకు రాలేరనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈవిషయంలో ఎస్ఈసి పునరాలోచించాలని కోరుతున్నారు.

## ప్రశాంతంగా ఎన్నిలకు జరిగేలా సహకరించాలి
-జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్

**చౌటకూరు, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనేలా ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చౌటకూర్‌లోని రైతు వేదికలో పంచాయతీ ఎన్నికలబరిలో ఉన్న సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాకేష్ మాట్లాడుతూ అభ్యర్థులు ఏరోజుకారోజు ఖర్చులను నమోదు చేయాలన్నారు. సర్పంచ్ అభ్యర్థులు రూ.1లక్ష50వేలు, వార్డ్‌సభ్యులు రూ.30వేలకు మించకుండా ఖర్చుచేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు, మద్యం, బహుమతులు అందచేస్తే చర్యలుతప్పవన్నారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలపై ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు అతికించరాదన్నారు. ఇంటి యజమానుల అనుమతితోనే డోర్‌పోస్టర్లు అంటించుకోవాల్సి ఉంటుందన్నారు. పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్ మాట్లాడుతూ గ్రామాల్లో లౌడ్ స్పీకర్లు, వాహనాల తిప్పేందుకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నామాల కిష్టయ్య, ఎంపిడిఓ కె. శంకర్, మండల ఎన్నికల వ్యయ పరిశీలకులు నిరంజన్, మండల ప్రత్యేక అధికారి వసంతకుమారి, ఎంపిఓ సువర్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్, అకౌంట్స్ టీం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం...
-మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు


అబ్లాపూర్‌లో మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రచారం

**పాపన్నపేట, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు కోరారు. సోమవారం పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్, జయపురం, అబ్లాపూర్, అన్నారం, కుర్తివాడ, దౌలాపూర్, పాతలింగాయిపల్లి, కొత్తలింగాయిపల్లి, తమ్మాయిపల్లి గ్రామాల్లో సుడిగాలి పర్యటనచేసి కాంగ్రెస్‌పార్టీ మద్దతుదారుల అభ్యర్థులపక్షాన ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో ఆయాగ్రామాల్లో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, ఆయాగ్రామాలలో బరిలో నిలిచిన అభ్యర్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా..

**నారాయణఖేడ్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
అవకాశం ఇయ్యండి అభివృద్ధి చేస్తానని నిజాంపేట్ మండల్ నగర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి మహిపాల్ అన్నారు. సోమవారం గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తానని యువకుడిని అయిన తనను గెలిపించి ఆశీర్వదించాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పెద్ద సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి మహిపాల్ అన్నారు.

## పెద్దశంకరంపేట సమగ్ర అభివృద్ధికి చర్యలు
-నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామపంచాయతీ అయిన పెద్ద శంకరంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణం సర్పంచ్ అభ్యర్థి ఆసూరి చంద్రమురళీపంతులు నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో గ్రామపంచాయతీలో ఫేక్ రసీదు పుస్తకాలు తయారుచేసి బిల్లులను నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారని విమర్శించారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ లక్ష్యమని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి ఆసూరి చంద్రమురళీ, కాంగ్రెస్ నాయకులు, రాయిని మధుసూదన్, దానంపల్లి నారాగౌడ్, విగ్రహం వేణుగోపాల్‌గౌడ్, సంగమేశ్వర్, రాజేందర్‌గౌడ్, సుభాష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెకు ప్రజలు తగినబుద్ధి చెప్పాలి
-బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**పాపన్నపేట, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు ప్రజలు మరోసారి మోసపోవద్దని మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నుండి సర్పంచ్, వార్డ్ స్థానానికి బరిలో ఉన్న అభ్యర్థులు కోడపాక సర్పంచ్ అభ్యర్థి గౌరీగారి పంకజకాశీనాథ్, శేరిపల్లి సర్పంచ్ అభ్యర్థిని లావణ్య నర్సింలు, బాచారం సర్పంచ్ అభ్యర్థి సొంగ పవిత్రదుర్గయ్య తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లెల ప్రగతి కోసం నిస్వార్థంగా పనిచేసేదెవరో ఆలోచించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఓటేయాలని విజ్ఞప్తిచేశారు. స్థానిక సంస్థలకు జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధిచెప్పి బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పంచాయతీ ఎన్నికలున్నాయని గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు, కాని పట్టణాల్లో ఎన్నికలు లేవని మహిళలు ఇవ్వలేదన్నారు. ఓట్ల కోసమే చీరలను అందించిన విషయాన్ని మహిళలు గ్రహించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాల క్రితం మోసపూరితమైన వాగ్దానాలు చేసి ప్రజల ఓట్లను దండుకొని ఆతర్వాత మొండిచేయిచూపిందని విమర్శించారు. అధికారం లోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చకుండా ప్రజలను వంచిందని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థులకు ఓటేసి భారీ మెజార్జీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో కోడపాక మాజీ సర్పంచ్‌లు సంగప్ప, వెంకట్, రాములు, మాజీ ఎంపిటిసి చారి, నాయకులు దుర్గయ్య, దత్తు, శ్రీనివాస్‌గౌడ్, బాలయ్య, దావిడ్, చాన్ బాషా, సాయివర్ధన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు

-జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కె.హైమావతి



మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం మైక్రో అబ్జర్వర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు జరిగే ఎన్నికలసరళిని సునిశితంగా పరిశీలించి అవసరమైన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఎన్నికల పరిశీలకులకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలింగ్ లొకేషన్లలో పోలింగ్ కేంద్రాలలో మాక్ పోలింగ్‌ను మొదలుకొని పోలింగ్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వసతులు, పోలింగ్ సమయం, ఓట్ల లెక్కింపు పూర్తిచేసే వరకు పరిశీలిస్తూ రిపోర్టు అందించాలని తెలిపారు. మూడో విడతలో జరిగే పోలింగ్‌లో పోలింగ్‌కు ముందురోజే మండలంలో రిపోర్టు చేయాలన్నారు. అబ్జర్వర్లవిధులు చాలాకీలకమని కండ్లతో మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. ఎలక్షన్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకు ముందు మాస్టర్ ట్రైని అయోధ్యరెడ్డి ఎన్నికల మైక్రో అబ్జర్వర్లకు గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పి సిఈవో రమేష్, డిఆర్‌డిఏ పిడి జయదేవ్ ఆర్యా, డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎల్డిఎం హరిబాబు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు కీలకం
-జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు

**మెదక్, డిసెంబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:**
స్థానిక సంస్థల ఎన్నికలు మెదక్ జిల్లాలో శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి ఓటరు, ప్రతి పౌరుడు సహకరించాలని జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ముఖ్య సూచనలు జారీ చేశారు. మీ పేరు తాజా ఓటర్ జాబితాలో ఉన్నదో, లేదో తప్పనిసరిగా పరిశీలించండి. మీ పోలింగ్ స్టేషన్ వివరాలు ముందుగానే తెలుసుకోండి. పోలింగ్ రోజున ఎపిక్ / ఓటర్ ఐడి / ఇతర వ్యాలిడ్ ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురండి. తెలియని వ్యక్తులకు ఓటర్ ఐడి లేదా ఓటర్ స్లిప్ ఇవ్వకూడదు. పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడి సిబ్బంది సూచనలు పాటిస్తూ మీ ఓటుహక్కును వినియోగించుకోండి. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో, ముఖ్యంగా 100మీటర్ల పరిధిలో ప్రచారం పూర్తిగా నిషేధం. వేరొకరి పేరు మీద ఓటు వేయడానికి ప్రయత్నించడం చట్టరీత్యా నేరం. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డివి శ్రీనివాసరావు హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద గుమిగూడడం నిషేధం. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే ముందస్తుగా అనుమతి తీసుకోవడం తప్పనిసరి. సౌండ్ సిస్టమ్, బాణాసంచా వినియోగం కోసం కూడా పోలీసు అనుమతి తప్పనిసరి. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు నియమాలు పాటిస్తూ, ప్రజాస్వామ్య హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు జిల్లా ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## సర్పంచ్‌కు 43-వార్డులకు 327 నామినేషన్లు

**పుల్‌కల్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు 4 పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 15 పంచాయతీలలో 43 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. 172 వార్డు స్థానాలకు 25 వార్డులు ఏకగ్రీవం కాగా 147 వార్డులకు 327 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. నామినేషన్ ఉపసంహరణ ముగియడంతో పోటీకి సై అంటున్న అభ్యర్థుల వివరాలను అధికారులు బహిర్గతం చేశారు. ఒక్కో పంచాయతీలో ముగ్గురు నుంచి ఏడుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పెద్దారెడ్డిపేట, పుల్‌కల్, పోచారం, ముద్దాయిపేట, మిన్‌పూర్, ఎస్.ఇటిక్యాల, ముదిమాణిక్యం పంచాయతీలలో ఇద్దరు చొప్పున, హన్నానాయక్ తండా, గొంగ్లూర్ తండా, ఇసోజిపేట, కోడూరు, సింగూరు, మంతూరు పంచాయతీలో ముగ్గురు చొప్పున, బస్వాపూర్‌లో నలుగురు, గొంగ్లూర్‌లో ఏడుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలినట్లు అధికారులు ప్రకటించారు.

**-చౌటకూరు మండలంలో...**
చౌటకూరు మండలంలోని 15 పంచాయతీలకు సరాఫ్‌పల్లి సర్పంచ్‌తో పాటు మూడువార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 14 పంచాయతీలకు 43 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మండలంలోని 134 వార్డులకు గాను 9 వార్డులు ఏకగ్రీవం కాగా 125 వార్డులకు 302 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. బొమ్మారెడ్డిగూడెం, సుల్తాన్‌పూర్, గంగోజిపేట, లింగంపల్లి, తాడ్దాన్‌పల్లి పంచాయతీలకు ఇద్దరు చొప్పున, చక్రియాల, కోర్పోలు, శివంపేట, ఉప్పగిగూడెం, వెండికోలు పంచాయతీలకు ముగ్గురు చొప్పున, బద్రిగూడెం, వెంకటకిష్టాపూర్, పోసానిపల్లిలో నలుగురు చొప్పున అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులో ఆరుమంది అభ్యర్థులు ఎన్నికల బరిలో పోటీ పడుతున్నారు.

## ప్రతి విద్యార్థి క్రీడలో రాణించాలి: ఎ.కృష్ణ

**గుమ్మడిదల, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ విద్యార్థులకు క్రీడా ప్రోత్సాహం అందించేందుకు సంగారెడ్డి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.కృష్ణ ముందుకు వచ్చారు. తన సొంత నిధులతో ప్రత్యేకంగా కేటాయించి, వసతి గృహ విద్యార్థులకు వాలీబాల్ కిట్లను సోమవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎ.కృష్ణ మాట్లాడుతూ, చిన్న సహాయం కూడా పెద్ద మార్పు తేవచ్చు అని పేర్కొన్నారు. విద్యార్థులకు సరైన దారిచూపి, క్రీడలపై ఆసక్తి పెంపొందించడం తన ధ్యేయమని చెప్పారు. కిట్లు అందుకున్న విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తంచేస్తూ, భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వసతిగృహ సిబ్బంది ఎ.కృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవి కుమార్, ఉపాధ్యాయులు రాజు, క్రీడా అభిమానులు, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పట్టం కట్టండి


ప్రచారంలో మాట్లాడుతున్న రజితవినయ్

**నారాయణఖేడ్, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నటువంటి లింగాపూరం రజితవినయ్‌ని ఆదరించి గెలిపించాలని వినయ్ అన్నారు. సోమవారం ఆయన గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ఎంపి సురేష్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారం తీసుకుంటానని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ముఖ్యంగా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసుతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఎన్నికలలో వివాదాలు సృష్టిస్తే కఠినచర్యలే
-ఎస్ఐ తోట మహేష్

**కొమురవెల్లి, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో శాంతిభద్రతలు కాపాడడం ప్రజలు తమ అభిప్రాయాన్ని అడ్డంకులులేకుండా స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసు స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలలో చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తోట మహేష్ సోమవారం తెలిపారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించే అవకాశం ఉన్న గతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డ 52 మందిని గుర్తించి 126 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టామని తెలిపారు. 52 మంది రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులపై బైండోవర్ నోటీసులు ఇచ్చి తహసీల్దార్ సమక్షంలో బాండ్‌లు తీసుకున్నట్లు వివరించారు. ఎవరైనా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ప్రయత్నం చేస్తే లేదా వివాదాలు సృష్టించినట్లయితే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణ కొనసాగించేందుకు పటిష్టమైన బందోబస్తు చర్యలతోపాటు మొబైల్ పెట్రోలింగ్, ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఏవైనా బెదిరింపులు, మద్యం, డబ్బు పంపిణీ వంటి అక్రమ కార్యకలాపాలు పాల్పడినట్లు తెలిస్తే, వెంటనే 8712667475కు లేదా 100కు సమాచారం అందించాలన్నారు.

## గుండెపోటులో వార్డు అభ్యర్థి మృతి

**చౌటకూరు, డిసెంబరు 8, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చక్రియాల పంచాయతీలోని 8వ వార్డుకు పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన కొత్తొల్ల పద్మారావు(50) ఆదివారం అర్థరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంట్లో నిద్రపోయిన సమయంలో ఈ సంఘటన జరిగింది. మృతుడికి భార్య నర్సమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. తమ ప్యానల్‌లోని వార్డ్ అభ్యర్థి అకాలమృతి చెందడంతో సర్పంచ్ అభ్యర్థి అందోల్ నాగలత కృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం చక్రియాల్‌లో పద్మారావుకు కన్నీటి వీడ్కోలు పలికారు.

**యథావిధిగా ఎన్నికలు-ఎంపిడిఓ...**
వార్డు అభ్యర్థి అకాలమృతితో ఈ నెల 14న జరుగనున్న పంచాయతీ ఎన్నికలు యథావిధిగా జరుగుతాయని ఎంపిడిఓ కె.శంకర్ పేర్కొన్నారు. పంచాయతీలోని 10వార్డులకు, సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని ఎంపిడిఓ శంకర్ ప్రభాతవార్త ప్రశ్నకు బదులిచ్చారు.